క్లుప్తంగా

పాన్‌గల్ పీహెచ్‌సీకి అదనపు వైద్యుడు


చంద్రశేఖర్

పాన్‌గల్: పాన్‌గల్ పీహెచ్‌సీ అదనపు డాక్టర్‌గా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తూ బదిలీపై మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో అందుబాటులో ఉంటూ మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా.. ఒక డాక్టర్ డిప్యూటేషన్‌పై కడుకుంట్ల పీహెచ్‌సీకి వెళ్లగా ఇక్కడ కొన్ని నెలలుగా రెగ్యూలర్ డాక్టర్ లేక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పీహెచ్‌సీకి అదనపు డాక్టర్ రావడంతో ఇబ్బందులు తొలుగుతాయని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు




పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుకోవాలని సూచించారు. 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. దీంతో పాటు విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు, వైద్య సిబ్బంది మధుబాబు, నర్సమ్మ పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు కవిత, రాధిక, నిర్మల, భార్గవి, గీత, సుమలత, లత, శ్రీలత, రమాదేవి, లక్ష్మి, సంధ్య, భాగ్యలక్ష్మి, అరుంధతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కతాల్‌సాబ్ ఉర్సు



పెబ్బేరు రూరల్: మండలంలోని వై.శాఖాపూర్‌లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన కతాల్‌సాబ్ ఉర్సు శుక్రవారం ముగిసింది. శాఖాపూర్, నాటవెల్లి, తోమాలపల్లి, పామాపురం ప్రజలు, పలువురు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని మాలీజ ముద్దలు, టెంకాయలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సత్యంసాగర్ దర్గా నిర్వాహకులు రంజాన్, ఇబ్రహీం, మహ్మద్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గురం అంజి, మంగలి కాశీ, అభినవ నాయుడు, కారోబార్ వెంకటేష్‌యాదవ్, మరాటి మన్యం, లక్ష్మణ్‌నాయుడు, శివ, శంకర్, చందు తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే నిర్వహించాలి

పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రామ పంచాయతీల్లో డ్రై డే ను తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సుషిత అధికారులకు ఆదేశించారు. ఆమె శ్రీరంగాపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల వ్యాప్తిని తగ్గించాలన్నారు. 11, 21వ తేదీల్లో తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, గ్రామాల్లో డ్రెయినేజీలను నిత్యం శుభ్రం చేయాలన్నారు. అదే విధంగా మన మండలానికి ఇచ్చిన వన మహోత్సవం టార్గెట్ పూర్తి చేయాలని ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ రాజు, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.




మేడేపల్లిలో..


అమరచింతలోని ఐదో వార్డులో..


పెబ్బేరు పట్టణంలో..

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

ఆత్మకూర్: పట్టణంలోని ఎనిమిదో వార్డులో శుక్రవారం జిల్లా వైద్య అడ్మినిస్ట్రేట్ అధికారులు డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్ వంశీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపు నీటిని ఇళ్ల పరిసరాల్లో నిల్వలు ఉండడం ద్వారా దోమలు పెరిగి విషజ్వారాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మోట్లంపల్లిలో..

మండలంలోని మోట్లంపల్లి, మేడేపల్లి గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, ఎంపీఓ శ్రీరాంరెడ్డి గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షరీఫ్పోద్దీన్, శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని సింగంపేటలో శుక్రవారం చేపడుతున్న డ్రై డే కార్యక్రమాన్ని డీపీఓ రమణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతుల కోసం మిషన్ భగీరథ అధికారులకు నివేదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న చైర్మన్ గాయత్రి, డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, అధికారులు

పారిశుద్ధ్య పనులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం కోరారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఐదో వార్డులో పిచ్చి మొక్కలను కార్మికులతో తొలగించారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీఓ రాజు అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ కార్మికులతో గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

పాన్‌గల్: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండొచ్చని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నిర్మూలనపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో పాటు జ్వర అనుమానితులపై ఇంటింటి సర్వే నిర్వహించి అనుమానితుల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పరశురాం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి

వీపనగండ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో గ్రామంలోని ప్రజలందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు మురుగు బయటకు రాకుండా చూసుకోవాలని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె కమిషనర్ ఆదిశేషు, ఏఎల్ఓ టీంతో కలిసి శుక్రవారం పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో ఆంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించారు. పట్టణంలో తిరుగుతూ హౌజ్‌ల్లో నిల్వ నీటిని పారపోశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ, అధికారులు మహ్మద్ బురాన్, బాబు, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నంబావి: పరిసరాలను పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే డ్రై డే కార్యక్రమన్ని నిర్వహించినట్లు డివిజన్ పంచాయతీ అధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్ద దగడ, చిన్నమారు గ్రామాల్లో ఎంపీడీఓ రమణరావుతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రోగాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు.


సింగంపేటలో నిల్వనీటిని పారబోయిస్తున్న డీపీఓ రమణమూర్తి


వీపనగండ్లలో..


ఉప్పరిపల్లిలో..


కేతేపల్లిలో..

భీమా కాల్వకు సాగునీరు విడుదల చేయాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల ద్వారా ప్రవహించే భీమా కాల్వకు సాగునీటిని విడుదల చేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో రైతులు వరి నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కానీ కాల్వ ద్వారా సాగునీరు విడుదల కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మల్లాయిపల్లి, చింతకుంట, దొండాయిపల్లి, మాందాపూర్, కొత్తపేట, బండపల్లి, బుసిరెడ్డిపల్లి, జమ్మాపూర్, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి తదితర గ్రామాల రైతులు ఈ కాల్వపైనే ఆధారపడి పంటలను సాగు చేస్తారన్నారు. ఆయా గ్రామాల రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు, అక్కడక్కడ ఉన్న బోరు నీటితో పొలాలను నాటేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వకు సాగునీటిని విడుదల చేసి ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మాణం పూర్తిచేయరూ..

వీపనగండ్ల: మండల కేంద్రంలో అసంపూర్తి నిర్మాణంతో దర్శనమిస్తున్న బస్ షెల్టర్‌ను పూర్తిస్థాయిలో నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్డి వసతులు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి శుక్రవారం మండల కేంద్రంలో సంత జరుగుతుండడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు వస్తుంటారు. దీనికి అనుగుణంగా సరైన వసతులు లేకపోవడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

ఖిల్లాఘనపురం: డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీహరి వివరాల ప్రకారం మద్యం సేవించి మోటారు సైకిల్ నడుపుతున్న సల్కెలాపురం గ్రామానికి చెందిన బోయిని వెంకటేష్, వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కావలి సాయిబాబా, వెనకితండాకు చెందిన ముడావత్ హనుమంతును పట్టుకుని డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేయగా.. మద్యం తాగి ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వారిని శుక్రవారం వనపర్తి రెండో అదనపు కోర్టు జడ్జి వై.జానకి ఎదుట హాజరుపరిచగా.. వారికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

‘ప్రజల కోసం పనిచేస్తే ఆశీర్వదిస్తారు’


మాట్లాడుతున్న రాజవర్ధన్‌రెడ్డి

వనపర్తిటౌన్: ప్రజల్లోకి వెళ్లి పనిచేస్తే వారు ఆశీర్వదిస్తారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము అధ్యక్షతన నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 వార్డులకు గాను 26 వార్డుల్లో గెలిచి బీజేపీ సత్తా చాటాలని మార్గనిర్దేశం చేశారు. మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీ అభ్యర్థే కైవసం చేసుకోవాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని, అప్పుడే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో వనపర్తిలోని 64 బూత్‌ల్లో 43 బూత్‌ల్లో బీజేపీకి మెజార్టీ ఓట్లు లభించాయని, మిగతా బూత్‌ల్లో రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. బీజేపీపై ప్రజలకు నమ్మకం ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ బీజేపీ అభ్యర్థి గెలిచేలా ప్రణాళికతో ముందుకెళ్దామని సూచించారు. అంతకుముందు రాజవర్ధన్‌రెడ్డిని నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, మున్నూరు రవీందర్, శ్రీశైలం, సుమిత్రమ్మ, వెంకటేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొమ్ము సామేల్, అశ్వినిరాధ, రాయన్న సాగర్, అలివేలమ్మ, లక్ష్మి, పుష్ప, కవిత, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లకు సన్మానం


జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్లను సన్మానిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ తదితరులు


ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యాంసుందర్, రాములును ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, సతీష్ కుమార్, జన్ను మధు శుక్రవారం కార్యాలయంలో వారిని శాలువాలతో సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలో భాగస్వాములుగా అవకాశం రావడం అదృష్టంగా భావించాలని వారు చెప్పారు. మండలంలోని రైతుల అవసరాల కోసం నిరంతరం కృషిచేయాలని కోరారు.

ఎంపీ సహకారంతో అభివృద్ధి చేసుకుందాం



అమరచింత: పాలమూర్ ఎంపీగా గెలుపొందిన డీకే అరుణ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధి చేసుకుందామని బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి బీజేపీ నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 8 ఎంపీ స్థానాలను, అసెంబ్లీకి 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించడంలో కార్యకర్తల కష్టం మరువలేనిదన్నారు. అమరచింత మండలానికి ఇచ్చిన హామీలను అమలు పర్చేందుకు ఎంపీ డీకే అరుణ సిద్ధంగా ఉన్నారన్నారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుతో పాటు చంద్రగఢ్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కాలేజీ ఏర్పాటుతో పాటు, గురుకుల పాఠశాల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని, వాటిని సాధించుకునేందుకు మండలంలోని నాయకులు, ఇప్పటికే ఎంపీకి వినతి పత్రాలు అందిచారన్నారు. కార్యక్రమంలో మేర్వరాజు, హరీష్, మల్లారెడ్డి, భాస్కర్, నరాల నారాయణ, అశోక్, అనిల్ ఉన్నారు.

నేటి నుంచి హజ్రత్ ఉర్సు ప్రారంభం


హజ్రత్‌సయ్యద్‌షా సాహెబ్ దర్గా

ఆత్మకూర్: పట్టణంలో వెలసిన హాజరత్ సయ్యద్ షా సాహేబ్, హాజరత్ సయ్యద్ మౌలానా సాహేబ్‌ల ఉర్సు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 27వ తేదీన రాత్రి 8 గంటలకు జమేదార్ వీధిలోని ఎక్బాల్‌బిన్ సయ్యద్ ఇంటి నుంచి ప్రత్యేక అలంకారాలతో గంధోత్సవం ఊరేగింపుగా ప్రారంభిస్తారు. రాత్రి 11గంటలకు దీపారాధన, ప్రముఖ గాయకులచే ఖవ్వాలీ గాన కచేరి కార్యక్రమాలు జరుగుతాయి. 28వ తేదీ ఉదయం 10గంటలకు ఖత్మే ఖురాన్, ఫాతేహా, మధ్యాహ్నం 12గంటలకు దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఖమర్‌బిన్ సయ్యద్ తెలిపారు. ఈ ఉత్సవాలకు గుల్బార్గా, హల్‌కట్టా, వట్టెం షరీఫ్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖ ముర్షద్‌లు, బాబాలు, పూజ్యగురువులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉర్సుకు హాజరయ్యే మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నామని, భక్తులు వేలాదిగా హాజరై ఫాతేహా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డుకు చెందిన మహిమూద్ మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుడు ఎండీ ముఖిద్ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వెంకటేష్ శుక్రవారం మహిమూద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పంపిన రూ. 5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో లతీఫ్, జహంగీర్, అస్లాం, ధర్మేందర్ ఉన్నారు.

గోపాల్‌పేట: ఆపదలో ఉన్న కుటుంబాలకు తప్పకుండా అండగా ఉంటామని కర్రోళ్ల స్వప్నభాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాగిరి చిన్నమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న కర్రోళ్ల స్వప్నభాస్కర్ వారి అనుచరుల ద్వారా రూ.ఐదు వేలు పంపారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు యువకులు రూ.ఐదు వేలు అందించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో యువత, విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరేందర్ సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్లకు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించి ఓటీపీలు, బ్యాంక్ వివరాలు చెప్పొద్దని సూచించారు. మెసేజ్‌ల రూపంలో వచ్చే అసవసర లింక్‌లు క్లిక్ చేయొద్దని, అలాంటి వాటి ద్వారా డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

జూరాల వద్ద భద్రత పటిష్టం

అమరచింత: జూరాల ప్రాజెక్టు దిగువ నదిలోకి ఎవరూ వెళ్లకుండా ముళ్ల కంచెను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని సీఐ శివకుమార్ తెలిపారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరుకోవడంతో జూరాల క్రస్ట్ గేట్లను తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో కృష్ణానది ఉగ్రరూపంలో ప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం అమరచింత పోలీసులతో కలిసి పుష్కరఘాట్లకు వెళ్లే రహదారులను మూసి ఉంచారు. వీటితో పాటు ప్రతి నిత్యం పోలీసు పహారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌కుమార్ ఉన్నారు.

‘ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలు సరికాదు’

పెబ్బేరు రూరల్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్ల యూనియన్ (సీఐటీయూ) అనుబంధ అధ్యక్షురాలు శారద ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్‌వాడీలో రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలు తేవాలని ఆలోచిస్తున్నారని, జూలై 19న జరిగిన అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లు పత్రికల్లో వచ్చింది. మూడో తరగతి వరకు ఐసీడీఎస్‌లో విద్యను ప్రాథమిక విద్యను గడపాలని ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక టీచర్‌ను కేటాయిస్తామని ప్రకటించడం వంటి ఏకపక్ష నిర్ణయాలు ఐసీడీఎస్ వ్యవస్థకు నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో రమేష్, బొబ్బిలి నిక్సన్, నారాయణమ్మ, కవిత, రమాదేవి, సుమతి, భాగ్యలక్ష్మి, విజయ, జ్యోతి, సంధ్యారాణి ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న సీఐ రాంబాబు

పెబ్బేరు రూరల్: మొక్కలను నాటి సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని సీఐ రాంబాబు అన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పీజేపీ క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను కాపాడి పర్యావరణాన్ని కాపాడాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు, పోలీస్‌సిబ్బంది, ఆటో, జీప్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెళ్లే దారి విస్తరించాలని వినతి

కొత్తకోట రూరల్: పట్టణ శివారులో గల వెంకటగిరి ఆలయానికి వెళ్లే దారి వెడల్పు చేయాలని కోరుతూ కొత్తకోట ప్రజలు, కాంగ్రెస్ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వెంకటగిరి ఆలయానికి పట్టణ కేంద్రంతో పాటు నిర్వేన్, పాలెం, రామనంతాపురం గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు వారంలో రెండు సార్లు ఆలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఆలయానికి వెళ్లే దారి చెరువు కట్టపై ఉండటంతో పాటు సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా పట్టణవాసులు వాకింగ్ చేసేందుకు మైదానాలు లేకపోవడంతో వెంకటగిరి ఆలయానికి వెళ్లే చెరువుకట్టపై రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి, రాములుయాదవ్, శంకర్ యాదవ్, సాయిలుయాదవ్ తదితరులు ఉన్నారు.

జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

పెబ్బేరు రూరల్: జిల్లాకేంద్రంలో ఈ నెల 29న జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు.